# అష్టా-చెమ్మా

శివల జగన్నాథరావు

''సంధ్య ఎలావుందోయ్, నాగరాజూ?''

అని స్నేహితుణ్ణి అడిగాడు వసుదేవుడు.

''ఆవిడకేవోయ్! ఫస్టుగా వుంది! ఎప్పటికప్పుడే కొత్తపెళ్ళి కూతుర్లా వుంటుంది'' అని చెప్పేడు నాగరాజు. వసుదేవుడు మందహాసంతో సాయంత్రాన్ని పరికిస్తూ ''ఆహా! ఏంగాలి?! ఏం ఆకాశం!? ఆ రంగులు చూడక్కడ! నిజంగా ఆయుర్దాయం మరో నూరేళ్ళుంటే బావుండు నన్పిస్తోంది నాకు ఈ సంధ్యాసమయాలకోసం!!'' అన్నాడు. అని, అంతలో స్నేహితుణ్ణి జార్తగా చూసేడు. ''ఏవిటలా విసుగ్గాను, విచారంగాను వున్నావ్?'' అడిగేడు.

''అవునయ్యా! విచారం నాక్కాకపోతే, నీకా? నీకేం? మరో నూరేళ్ళయినా కావాలన్పిస్తుంది నీకు! అన్ని విధాలా జరుగుబడి వున్నవాడివి!! అయిశ్వర్యమూ వుంది! ఆదుకొనే నీవాళ్ళూ వున్నారు! నాకేమో, మరి... ఎంతవేగిరం టిక్కెట్టుకొనిస్కుందామా అని వుందనుకో!''

ఇద్దరూ ఆ పార్కులో, సిమెంటు బెంచీ మీద చతికిలబడ్డారు. వసుదేవుడు లాల్చీజేబులోంచీ కారాకిళ్ళీ ఓటితీసి, బుగ్గలో పెట్టేసుకున్నాడు. అదుంటే అతనికి లోకం ఆహ్లాదభరితంగాను, మనసు ఆనందమందిరంగాను వుంటుంది. తాశీల్దారు చేసి రిటైరు అయ్యేడు. మేడగూటంలా వేసుకున్నాడు. వాయుగుండం వస్తే లోకం వొణికిపోవాలిగాని ఆయన మేడ తొణకదు. మేడలో పైన తాముంటున్నారు. కిందంతా అద్దెలే. అబ్బాయి డాక్టరే, అల్లుణ్ణీ డాక్టర్నే తెచ్చాడు. కొడలినీ డాక్టర్నే తెచ్చాడు. ''ఇంతమంది డాక్టర్లేవిటయ్యా నీకు?'' అని నాగరాజు అంటే— ''వాళ్ళంతాకల్సి నాఆయుర్దాయాన్ని పెంచడానికయ్యా'' అని సమాధానం చెప్పాడు వసుదేవుడు.

**నాగరాజుది, వసుదేవుడిదీ పక్కపక్క ళ్ళే.**

వసుదేవుడి మేడ ముందు నాగరాజు పెంకుటిల్లు దివిటీ ముందు దీపంలా వుంటుంది. నాగరాజు ఎలిమెంటరీ బడిపంతులు. రిటైరు అయి అయిదేళ్ళవుతోంది. అతనికి నలుగురు పిల్లలు. పెద్దాడపిల్లకి దాని పద్దెనిమిదోయేటే పెళ్ళి చేస్తే, ఆ కుర్రవాడు ఇద్దరు పిల్లల్ని కనీ, అయింతా ఎటో చెక్కేసేడు. అప్పటికిప్పటికి చాలాకాలం అయిందిగానీ అతగాడు మరి అయిపులేడు. తరవాతవాడు అబ్బాయి. వాడినంతా 'కొరడా' అంటారు. కొట్టినట్టే వుంటుంది అతగాడి మాటా, చేతాను. పేరు పరశురాముడు. ''వెధవకి వేరకపోయి పెట్టినాపేరు... ఎవళ్ళని నరుకుతాడో ఏవిటో!'' అని వాపోతుంటాడు నాగరాజు. పరశురాముడు ఇంట్లోవేలినట్టే చదువులో ఫస్టు. ఎప్పుడూ ఫస్టుక్లాసులే అతనివి. ఇంటిని ఏలీ, ఇండియాని ఏలీ, యూనివర్సిటీనేలి, విదేశానికెళ్ళిపోయాడు పరశురాముడు.

అమెరికాలో మంచి వుద్యోగంలో వున్నాడతను ఎంత హోదాలో వున్నా, ఆ గొప్పంతా చెప్పకొందికే. ఇంటికి పైసా పంపడు. ఆర్నెల్లకో వుత్తరం రాస్తేరాస్తాడు.

ఆ అబ్బాయి తర్వాతవాళ్ళిద్దరూ ఆడపిల్లలు. ఇంటరు చదివీ, పైన చదివే స్థోమతలేక ఇంట్లో వున్నారు. అది నాగరాజు కథ.

'కొడుకు అన్యాయం' గురించీ నాగరాజు స్నేహితుడు వసుదేవుడి చెవుల్లో రికార్డు వేస్తూనే వున్నాడు.

పార్కులో పాటలు వినడంలేదు వసుదేవుడు. నాగరాజు మాటలు పాటల్ని డామినేట్ చేసేస్తున్నయ్. ''వూర్కో, నాగరాజూ'' అంటున్నాడు పదినిమిషాలకోమారు.

''ఎట్లావూర్కునేదయ్యా? ఎలావూరుకునేది?'' అని గయ్యిమన్నాడు నాగరాజు.

**''నా బాధ నీకేం తెలుసయ్యా?''**

''ఎందుకు తెలీదూ? ఇన్నేళ్ళ నించీ రోజూ తెలుస్తోనే వుందిగదా?''

''నీకంతా వేళాకోళంగా వుందిలెద్దూ!''

ఆ మాటతో వసుదేవుడు జాలిపడిపోయి, వూరుకుండిపోయేడు.

నాగరాజుని చేతనయినంతదాకా ఆదుకోందికి వసుదేవుడు సిద్ధమే. కాని, నాగరాజే అభ్యంతరం పరికేడు.

''ఇవాళిస్తే రేపు ఇవ్వాలి! ఎన్నిమార్లివ్వగలవయ్యా? అయినా నిత్యం చచ్చేవాడి గురించీ ఎందుకేడవడం?''

వసుదేవుడెంత బలవంతం చేసినా నాగరాజు ఏనాడూ ఒక్క రూపాయి కూడా అతని వద్దనించీ తీసుకోలేదు. వసుదేవుడు మింగలేక, నిష్ఠూరం మాటల్ని కక్కేడు. పోనీ పౌరుషంపడేనా తననించీ నాగరాజు వుపకారం ఆశిస్తాడనుకున్నాడు. అదీ ఫలించలేదు.

''ఇదిగో! ఇలా అయితే, నేన్నీతో మాట్లాడనంతేనూ!'' అని కోపంగా అన్నాడవాళ.

నాగరాజు నవ్వి,'' ఏది? నువ్వెక్కడ మాట్లాడుతున్నావసలూ? అంతా నేనేగదా మాటలాడేదీ?'' అన్నాడు.

ఆ మొండిమనిషి గురించీ బాధపడ్డం తప్పా, తను వేరే చేసేదేమీ లేదనుకున్నాడు వసుదేవుడు.

* * *

ఆ మధ్యాహ్నం వసుదేవుడికి తనగదిలోకి సావిట్లోంచీ పరిచిత స్వరం విన్పించి, వులికిపడి, మంచమ్మీంచి లేచేడు. అలా ద్వారం దగ్గిరగా వెళ్ళాడు.

**సావిట్లో వర్దని ఒకామెతో మాట్లాడుతోంది.**

ఆమె చేతిలో బరువయిన సంచీ ఒకటి వున్నాది. ఆ సంచీలోంచీ, ఆమె మొదట పోలితిన్ కవరు ఒకటి తీసింది. అందులోంచీ వెగోడీలు కనిపిస్తున్నయి.

''మరో రెండియ్యి! మావాళ్ళు తింటారు'' అంటున్నది వర్దని.

''అట్లాగే, అట్లాగే...'' అంటూ మరో రెండు వెగోడీల పొట్లాలు తీసిచ్చిందామె.

''ఇంకేమున్నాయి?''

చూపించిందామె.

ఇంకా కొన్ని కవర్లలో చిన్న జెంతికలున్నవి. మాగాయ, నిమ్మకాయలాంటివి కొన్ని ఆ కవర్లలో పాక్ చేసివున్నవి.

వర్దని వూరగాయలు కూడా తీసుకొన్నదామెవద్ద నుంచీ.

ఆ దృశ్యం వసుదేవుణ్ని గదిగుమ్మం వద్ద కట్టేసి నించోబెట్టేసింది.

అతను సంతోషిస్తున్నాడు–

భార్య ఆమె దగ్గిర ఎక్కువ వస్తువులు తీసుకొన్నందుకు.

తృప్తి పడుతున్నాడు–

ఆమె సంచీ సగం అక్కడే చెల్లుబడి అయినందుకు

ఆమె కష్టానికి ప్రతిఫలం తమద్వారా ముడుతున్నందుకు.

విచారిస్తున్నాడతను–

ఆ అమ్మాయికి అలాంటి అవస్థ వచ్చిపడినందుకు

మండే ఎండలో ఇల్లిల్లూ తిరిగీ, ఆ వస్తువులు విక్రయించుకునే కష్టం ఆమెకి వచ్చినందుకు.

ఆ తండ్రికి తగ్గ కూతురే!!

వసుదేవుడు ఎంతో ఎంతో బాధపడ్డాడవాళ

ఆ విధంగా ఎంతో అవస్థలయినా పడతారుకాని, వాళ్ళు ఒకరి సాయాన్ని మాత్రం అర్థించరు!!

* * *

మిత్రులిద్దరూ ప్రతిరోజూ కలుసుకొంటూనే వున్నారు.

నాగరాజు ఒక్కడే మాట్లాడుతున్నాడు. అప్పుడూ ఇప్పుడూను.

''నువ్వు రేడియోవి! నేను శ్రోతని! అంతేనా?''

మిత్రుడి మాటకి నాగరాజు గట్టిగా నవ్వేశాడు.

రోజులు బరువుగా దొర్లుతున్నాయి.

అవేళ, వసుదేవుడి మనసు అస్థిమితంగా వున్నాది.

నాగరాజు తనని కలుకోలేకపోవటం కారణం కాదు.

ఉదయం పదిన్నర గంటలప్పుడు తను మేడమీద గది కిటికీ లోనించీ అవతలికి చూస్తూ వున్నాడు.

నాగరాజు వాళ్ళ ఇంటిముందరకి జామ్మంటూ ఒక స్కూటరు వచ్చి ఆగింది. స్కూటరు మీద ఒక యువకుడు. యువతి వున్నారు. అతను –

అమ్మాయి స్కూటరు దిగినాక '' టాటా''లు చెప్పేడు! ''ఛీరియో'' పలికేడు! ఏదో నవ్వుమాట విసిరేడు! ఆ అమ్మాయి ఆ మాటకి కిలకిల నవ్వింది! ఇద్దరూ ముద్దులు పరస్పరం విసురుకున్నారు.

'ఏవిటి వీళ్ళ ధైర్యం?!' అనుకున్నాడు వసుదేవుడు.

ఆశ్చర్యం ఆకాశం అంతయిందతనిలో.

ఆ అమ్మాయి బొత్తిగా ఏమీ బిడియపడకపోవటం, ధైర్యంగా నవ్వటం, ఆ యువకుడితో స్కూటరు మీదెళ్ళి వచ్చి దిగటమూ ఇవన్నీ వసుదేవుడిలో అలజడి రేపుతున్నాయి. అస్థిమితుడిని కావిస్తున్నాయి.

ఆ పిల్ల ముఖం మరీ అంత అందంగా లేదు. అలా అని అంత వికారంగానూ లేదు. ఆకర్షణ ఆమె మెరుపులలో, ముత్యాలవంటి పళ్ళ జిగజిగలలో, చక్కటి నవ్వులో, కొనదేరిన గెడ్డంలో, ఆరోగ్యవంతమయిన శరీరాకృతిలో, అవయవ సౌష్టవంలో వున్నాది!! యవ్వనం ఆమె శరీరాన్ని ఏలుతున్నాది! ఆమెని శాసిస్తున్నాది! ప్రోత్సాహం పలుకుతున్నాది!!

చెలికాడు దొరికాడు! ఇంకేం కావాలి?!

'బాగానే వుంది' అనుకున్నాడు వసుదేవుడు.

వీళ్ళ సంగతి వీళ్ళ వరకు, ప్రస్తుతానికి బాగానే వుంది!

అయితే—

ఆ పిల్ల తాలూకు వాళ్ళ మాట ఏమిటి!

వాళ్ళు ఒప్పుకొన్నారా? వీళ్ళ విహారాల్ని??

అంగీకరించారా? వీళ్ళ జోరుని?

సమర్థిస్తున్నారా? వీళ్ళ ప్రవర్తనని???

వసుదేవుడు చూస్తూనె వున్నాడప్పుడు. ఆ అమ్మాయి అతడికి టాటాలు, ఛీరియోలు చెప్పి, నవ్వుతూ, తుళ్ళుతూ, ఆ ఇంట్లోకి తుర్రుమంది!!

వసుదేవుడి హృదయం భారమయింది.

ఏ పని చేస్తున్నా ఆ దృశ్యమే ఎదలో కదులుతున్నాది.

సాయంత్రం ఎప్పుడవుతుందని ఎదురుచూశాడు.

సాయంత్రమూ వచ్చింది: నాగరాజూ వచ్చేడు.

''ఇవాళ మనం పార్కుకి... ఒద్దు ఒద్దు... మా తోటకి పోదాం! ఏం?''

చేతికర్రలు నేలని తాటించుతూ, కుక్కలని, కోళ్ళని, మేకలని అదలిస్తూ, పరిసరాలను పరికించుతూ ఇద్దరూ తోటలోకి వెళ్ళి చతికిలబడ్డారు.

తమ మధ్య మౌనం రాజ్యమే చేస్తుందని అనుకున్నాడు వసుదేవుడు.

నాగరాజు నిర్లిప్తంగా, నిరాసక్తంగా వుండిపోతాడను కున్నాడు.

అతని ఆలోచనలకి భిన్నంగా—

నాగరాజు అవాళ గడగడా, గబగబా మాట్లాడు తున్నాడు.

సెలయేర్లా, జలధారలా, సముద్రం హోరు హోరుకి మల్లేనూ, నాగరాజు ఎన్నో మాటలు చెప్పుకుపోతున్నాడు. కొడుకు తన కుటుంబానికి చేసిన అన్యాయాన్ని ఏకరువు



పెట్టేడు. వాడి స్వార్థాన్ని నిరసించేడు. వాడి దుర్మార్గాన్ని దుయ్యబట్టేడు. వాడి ద్రోహాన్ని అసహ్యంచు కొన్నాడు. తిట్టేడు. శాపాలు పెట్టేడు.

ఇంకా నాగరాజు మాటలలో పెద్దమ్మాయి పరిస్థితి వచ్చింది.

''ఏదో ఇప్పటికి అయినా, దాని బతుకది బతకటానికి సిద్ధం అయిందయ్యా!! ఫరవాలేదు నాకింక! కష్టపడు తున్నాదనుకో! పడితే పడింది మరి! ఎలాగ!ఎవరికీ కష్టం పడకుండా దినం గడవదుగదా? నేనే చెప్పేనా వుపాయం దానికి!...''

బుర్ర వూపుతున్నాడు వసుదేవుడన్నిమాటలకీను.

సాయంత్రం సన్నబడింది. చీకటి చిక్కబడింది.

చెట్లన్నీ పచ్చపచ్చటివల్లా ఇప్పుడు నల్లబడినాయి.

ఆకాశంలోకి చెంద్రుడు చిక్కీ సంగం అయ్యి, నీర్సంతో వచ్చేడు. అయినా తారకలు వదల్లేదతన్ని ఆరాధనకి అనారోగ్యం అభ్యంతరం కాదంటున్నాయి.

వసుదేవుడికి వుల్లాసం కాస్త కలిగిందప్పుడు చుట్టూరా చూస్తే.

''వెళదావా?''

''వెళదాం!''

నడుస్తుంటే 'అయ్యో! ఆ సంగతి' అని స్ఫురణకి తెచ్చుకున్నాడు వసుదేవుడు. ఏమీ చెప్పలేదేం ఇతను? ఒక్కముక్కకూడాను?! తను సరిగ్గానే చూశాడే! కళ్ళద్దాలు తుడిచీ మరీ పెట్టుకున్చూశాడే! ఆ అమ్మాయేనే! ఆ ఇల్లేనే! వాళ్ళ పిల్లేనే!! మరిదేంటి తనేం పలకడేవిటి ఆ విషయం తన దగ్గరా?

నాగరాజుకి గుంభన లేదే! అతని ఇల్లు ఇల్లంతా తీసీ పందిరివేస్తాడే తన ముందర?!... అలాంటి మనిషి?!...

ఆశ్చర్యంతో మతిపోతుందనిపిస్తున్నది అతడికి.



# 'ప్ర'పంచపదులు



## 89

నీడలాగా నీ వెంట పడేదే నిక్కమైన కీర్తి.
మృత్యుబాహువుల కందలేనిదే నిత్యమైన కీర్తి.
డప్పులు డబ్బులు కొనితెచ్చే ఆ మెప్పులకేం గానీ
రొమ్ము ఊబిలో ఉబికొచ్చేదే స్వచ్ఛమైన కీర్తి.
చిచ్చు అంచుపై నడిచొచ్చేదే మచ్చలేని కీర్తి.

## 90

మనిషిని విలువన చీల్చే రంపం దుఃఖం.
మనసు వేళ్లను పెకల్చే గునపం దుఃఖం.
దుఃఖం అంచులు దూకే బతుకే బతుకోయ్—
ఆశల రెక్కలు మాడ్చే తాపం దుఃఖం
ఆశయ గతులను పీల్చే కూపం దుఃఖం.

— డాక్టర్ సి.నారాయణరెడ్డి

''నాగరాజా...'' పిలిచేడు వుండబట్టక.

నాగరాజు చూసేడు. ''ఏవిటి?'' అడిగేడు. ఆ అడగడం కూడా అతిసహజంగాను, ఎంతో మామూలు గాను వున్నాది.

తోట దాటేరు; రోడ్లు దాటేరు; హైస్కూలు దాటేరు; ఆంజనేయులవారి కోవెల దాటేరు; ఇన్నీ దాటేరు కాని, ఇద్దరి మధ్యా మరొక్క మాటా పెగలలేదు.

'అతనెందుకు చెప్పకపోవాలి?' అని వసుదేవుడి పంతం.

'ఇన్ని మాటలకీ, ఇన్నేసి రామాయణాలకీ, భారతాలకీ నేను కావలసివచ్చేనా? ఏవీ? ఈ విషయానికే ఎడం అయ్యేనా??'

వసుదేవుడు కోపాన్ని దవడల్లో బిగబట్టి నడుస్తూ, ఇల్లు చేరేడు. ''వెడతానోయ్'' అని చెప్పేడు నాగరాజు.

ఏమీ చెప్పలేదు వసుదేవుడు.

* * * *

''ఈ విషయం ఆలకించేరాండీ?'' అన్నది వర్దని.

''ఏ విషయం?'' అడిగేడు వసుదేవుడు.

''మనబ్బాయి డిస్పెన్సరీకి మొన్నను, మీ స్నేహితుడి కూతురు ఇంకో అబ్బాయి కల్సి వెళ్ళేరుటండీ!''

''నాగరాజు కూతురా? ఏ కూతురుటా?''

''ఆఖరుది...''

వసుదేవుడు ఆలోచించాడు. మొన్నను తను చూసిన స్కూటరు అమ్మాయి రెండోది! అయితే మూడోపిల్ల కూడా ముగ్గులేస్తోందన్నమాట?! బావుంది! బావుంది! నాగరాజు చూస్తున్నాడా? లేదా? పట్టించుకుంటున్నాడా? లేదా? ప్రమాదాలు పసిగట్టడం లేదా, నాగరాజు?... ఏవిటో! గంద్రగోళంగా వుంది!

లోపల పెద్దగోల విన్పించీ, ''హుష్! ఏంటే ఆ గోలా?'' అన్నాడు వసుదేవుడు, వర్దని నవ్వుతూ, —''గోలేవిటండీ? మనవలిద్దరూ అష్టా చెమ్మా ఆడుకుంటు న్నారండీ!'' అని చెప్పింది.

''అలాగా'' అని వసుదేవుడా గదిలోకి వెళ్ళేడు.

కొడుకు పిల్లలు ప్రణయా, శేషూ నేలమీద కూచుని వున్నారు. వాళ్ళ మధ్యన అష్టాచెమ్మా గడులు గీయబడివున్నవి. ప్రణయవి చింతపిక్కలు. శేషూవి చిన్న గవ్వలు. ప్రణయ పెద్ద గవ్వలు గిలకరించీ వేసింది. అష్టా పడింది.

''అష్టా!'' అనరిచిందాపిల్ల ఆనందంతో.

''నీకన్నీ చక్కగా అష్టాలే! నాకే! వో రెండు చెమ్మాలే పడ్డాయి'' అని శేషూ బాధతో మూలుగుతూ అంటున్నాడు.

ప్రణయవి ఆసరికి మూడు పిక్కలు పంటగడిలోకి చేరుకున్నాయి.

నాలుగోపిక్క అదృష్టాన్ని అష్టాలతో తెచ్చుకుని గడుల్ని వురకలు వేస్తూ దాటుతున్నాది! ఆ పిల్ల ముఖం సంతోషంతో కళకళలాడుతున్నాది.

శేషు ముఖం నిండా విచారమే. బాధే. అసంతృప్తే.

అతని చిన్న గవ్వలు రెండు ఇంకా కదలలేదు ఒక్కగడి అయినా. మరో రెండు మాత్రం ఏడుగడిలో ఒకటి. మూడవగడిలో ఒకటి వున్నవి. అందులో ఒకటి మూడుమార్లు ప్రణయ చేతిలో ఛస్తే ఇందాకే ఎల్లాగో దాన్ని కష్టమ్మీద విడిపించుకున్నాడు శేషు చెమ్మా వేస్కుని. అతనిలో ఆరాటం తీవ్రంగా కనిపిస్తున్నది.

వసుదేవుడికి వాళ్ళని, వాళ్ళ ఆటని చూస్తోంటే, తనూ, నాగరాజూకిమల్లే అనిపించేరు. తన ఆట బాగానే సాగుతున్నది! ప్రణయలా!

నాగరాజూ 'అష్టాచెమ్మా' అతికష్టంగా ఆడు తున్నాడు!!

అష్టకష్టాలు పడుతున్నాడు. అయినా అదృష్టం అష్టా ఒక్కటీ అతడ్ని వరించలేదు. ప్చ్!! కనీసం చెమ్మా అయినా పడితే బావుణ్ను!

నాగరాజు గుండె చెమ్మగిల్లుతూనే వున్నది.

కళ్ళు చెమ్మగిల్లుతూనే వున్నవి

అయినా జీవితం 'అష్టా—చెమ్మా' అతడిని నిర సిస్తూనే వున్నది!!

''ఏవిటలా నించుండిపోయేరు? ఈ మధ్య మీకు పరధ్యానం పట్టుకుంది''అంది వర్దని.

''పంటపండెం ఎలా చేరతాడు? ఎప్పటికి?'' గొణిగాడు వసుదేవుడు.

విన్నది వర్దని ఆ మాట. ''ఎవరి గురించి అంటు న్నారు?''

''నాగరాజు గురించి...''

వర్దని నిట్టూర్చింది. ''అబ్బే! ఏమీ లాభం లేదు! కొడుకు అలాగ! కూతుళ్ళిలాగ! ఇంక పంటపండెం ఏవిటి నామొహం?''

మళ్ళాగొడవ. గోల. ప్రణయ అరుపులు. శేషు ఏడుపు కేకలు.

''అయితే, ఎందుకెళ్ళేరుటా, నాగరాజు కూతురూ, ఆతడూనూ, మనవాడి డిస్పెన్సరీకి?''

''ఫ్యామిలీప్లానింగు గురించి మాట్లాడేర్టండీ వాళ్ళూ! ఎంతకి తెగించారో చూసేరా?! పెళ్లి త్వరలో చేసుకొంటామని చెప్పేరుట!! మరో అయిదేళ్ళదాకా పిల్లలు కలక్కుండా!''

వసుదేవుడి బుర్రవేడెక్కింది. ''అలానా'' అన్నాడు.

* * * *

''ఏవయ్యా? మాట్లాడవూ?'' అడిగాడు నాగరాజు.

వసుదేవుడు నిట్టూర్చి, ''నువ్వు నాదగ్గర దాచే విషయాలుంటే.... మనది ప్రాణస్నేహం కాకుండా పోతూంటే, ఏం పలికేది? స్నేహంలో కూడా రహస్యం, మూతముప్పిడీ వుంటాయా, నాగరాజూ?'' అన్నాడు.

నాగరాజు ''లేదు. లేదు. వుండవుండవు'' అన్నాడు.

''ఎలా చెప్పేది, వసుదేవా! నాది చాలా డెలికేట్ పరిస్థితయ్యా! మావాళ్ళు వాళ్ళ తంటాలేవో వాళ్ళు పడుతున్నారనుకో!! వాళ్ళతో నాకు కోల్డ్‌వార్ అయింది! ఒక్కటి!! వాళ్ళంత తెలివితక్కువ వాళ్ళు కారు! అది నిజం!! కాకపోతే సమాజం సమాజమే!! అందులో నువ్వూవున్నావు! మీవాళ్ళూ వున్నారు! నేను ఆ విషయాలు దాస్తేనే, నాదీ, నా పెద్దకూతురిదీ మర్యాదలు మీ దగ్గర దక్కుతవి!! రేపది మీ ఇంటికే రావాలి! మళ్ళా మీరు నెలసరి వస్తువులు కొనాలి!! అంటే... మేం ఈ పరిస్థితిలో, కళ్ళూ, నోరూ మూసుకొనుండాలి.....''

వసుదేవుడింక నోరెత్తలేదు. అతని అంతరంగంలో శేషు మూలుగుతున్నాడు. ●